# వాత్సల్య బంధం

కోటంరాజు జనార్ధనరావు

బుద్ధి తెలిసినప్పటి నుంచీ ప్రతివాడూ, తన వాతావరణాన్ని అనుసరించి ఆశయాలను నిర్మించుకుంటాడు. పెద్ద డాక్టరు కుమారుడు గొప్ప డాక్టరు అవుదామనీ, గొప్ప లాయరు కుమారుడు ఇంకా గొప్ప లాయరు అవుదామనీ ఆశిస్తాడు. ఇలా మొదట్లో ప్రతీ బాలుడూ తన కుటుంబంలోని వ్యావహారిక విషయాలను ఆశయంగా పెట్టుకుంటాడు. ఈ విధంగా కాలం ముందుకు నడుస్తుంది. అంతకంతకు ఆ కుర్రవాని ఆశయాలు వయస్సుతో పాటు పెద్దవవుతూ వుంటాయి. కాని ఒకనాటికి పరిస్థితులన్నీ విషమించి అతని ఆశయాలన్నీ గాలిలో మేడలలాగ కూలిపోతాయి. అతనిలోని ;ఆవేశం కూడా అంతరించి పోతుంది.

ఆ విధంగానే ప్రసాదరావుకూడా తన జీవితంలో చేరవలసిన నిర్దిష్ట స్థానాలను నిర్ణయించుకున్నాడు. మొదటిది శరత్‌బాబు అంతటి రచయిత అవడం. రెండవది బళ్ళారి రాఘవాచారి వంటి నటకుడు అవడం. దాని కోసం చాలా కృషిచేశాడు. అప్పుడు ఆంధ్రదేశంలో వున్న తెలుగు పత్రికలన్నిటినీ తన రచనలతో నింపివేశాడు. ఊళ్లో ఉన్న అన్ని ఎమెచ్యూరు నాటకకంపెనీలలో వేషాలు వేస్తూ చాలా గ్రామాలు పర్యటన చేశాడు. ఫలితం రాబోతోంది. తన ఆశయాలు ఖాయంగా నెరవేరుతాయనుకొని, మంచి ఆవేశంతో పని చేస్తున్నాడు.

ఒకనాడు అమాంతంగా తన తండ్రి చనిపోవడంతో కుటుంబ భారం అంతా నెత్తిన పడింది. రచనలతోనూ, నటనలతోనూ తన జీవితం నడపుదామనుకున్న ప్రసాదరావు, మొదటిసారిగా కుటుంబాన్ని పోషించేందుకు ఒక నౌఖరీని సంపాదించ వలసి వచ్చింది. తన తండ్రి కున్న పలుకుబడితో గవర్నమెంటు నౌఖరీనే సంపాదించాడు. ఆ వచ్చే కొద్ది ఆదాయం



తోనూ సంసారాన్ని నడపుతూ తన ఆశయాలను నెరవేర్చుకుందామనుకున్నాడు. కాని గవర్నమెంటు అందుకు అంగీకరించలేదు. కొద్దికాలం కూడా ఈతనితో వియోగాన్ని సహించ లేకపోయింది. ప్రేమతో ఆఫీసు కట్టల రూపాన్ని అతన్ని ఎల్లవేళలా వెంటాడుతూ వుండేది.అతని ఆశయసిద్ధికి కాలం వుండేది కాదు. అల్లా కొన్ని సంవత్సరాలు ఈ ఘర్షణతో గడచి పోయింది. ఉద్యోగపు హోదా పెరిగింది క్రమక్రమంగా. అంతటితో, తన పూర్వపు ఆశయాలు నెరవేరవని దృఢ విశ్వాసం కలిగిన తరువాత, వాటిని మార్చుకో వలసి వచ్చింది— ఇప్పుడు అతని ఆశయం ఒక గెజెటెడ్ ఆఫీసరు అవుదామని. అయేసూచనలు కూడా కనపడుతున్నాయి.

అయినప్పటికీ అతనిలోని పూర్వపు కళావాసన యింకా వదలలేదు. అప్పుడప్పుడు ఆ ఆశయం తనలో కెలక వేస్తుంది. జరిగిన సంఘటనలన్నీ తలచుకొని విచారించేవాడు. ఆనాడు ఏ నాటకమో చూచో, లేక ఏ నవలో చదివో తృప్తిపడేవాడు. అయినప్పటికీ మానసం తృప్తి పడేదికాదు. ఆ తృప్తికై మార్గాలు అన్వేషించడం ప్రారంభించేవాడు.

దానికి తగినమార్గం లభించింది. మిథ్యా జీవితాన్ని వదలి వాస్తవిక ప్రపంచంలోకి వచ్చిన తరువాత ప్రసాదరావు జీవితంలో యిదే తొలి నెలవంక. అతని ఆనందానికి అంతులేదు. తన ఆశయాలు నెరవేరే అవకాశం లభించింది. తప్పక కృషిచేసి తనకు కలిగిన కుమారుని ఆ ఆశయసిద్ధికై తయారు చేస్తాడు. ఆశయాలు నెరవేరాయన్న తృప్తితో, ఆనందంతో తన వృద్ధాప్యంలో జీవితం చాలిస్తాడు.

తనకు కలిగిన పసికందును ఆ ఆశయ పుబాటలలో పెట్టటానికి తగిన మార్గాలు యిప్పటి

నుంచే అన్వేషించడం ప్రారంభించాడు. తప్పదు! కనీసం తనకుమారుడయినా అంతటివాడు కావలసిందే. మళ్ళీ శరత్‌బాబు, బళ్ళారి రాఘవ తన యింట్లో ఉద్భవించ వలసిందే. దానికిపూర్వం భార్యగా తన ఆశయసిద్ధికి ఎదురు తిరిగిన గృహిణి, తల్లిగా ఆ ఆశయసిద్ధికి ఒప్పుకుంది. అబ్బా! ఆమె స్వార్థం మాతృదేవత అయినప్పుడు ఎంత ఎక్కువ అయిపోయింది!

హైందవ చరిత్రలో జరిగిన సంఘటనలను ఆదర్శంగా పెట్టుకున్నారు ఆ దంపతులు. శివాజీ అంతటి వాడవటానికి అతని తల్లిదండ్రులే ప్రథమకారణం. ఆవిధంగా క్రమ శిక్షణతో పిల్లలను పెంచితే, నిర్వీర్యమైన భారతదేశం పునరుద్ధరింపబడుతుంది. ఆ కర్తవ్య బాధ్యత తల్లిదండ్రుల పైనే వున్నది.

ఆ విషయాన్ని గుర్తించుకొని ప్రసాదరావూ, అతని భార్యా, తమ ప్రేమఫలమైన కిశోర్‌ను తయారు చేయడం ప్రారంభించారు. చిన్నప్పటి నుంచీనూరిపోశారు. రోజురోజు కూ ఆకుర్రవాడు వాళ్ల ఆశయాలను అవగాహన చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు, పాటిస్తున్నాడు. ఆవిధంగా తల్లిదండ్రుల కృషితో కిశోర్ ముందుకు సాగుతున్నాడు. వాళ్ళ ఆనందానికి మేరే లేదు. వాళ్ళు చిత్రించుకుంటున్న చిత్రం ఒక క్రమ రూపాన్ని పొందింది.

* * *

అందమైన చిత్రాన్ని చిత్రిస్తున్న కొద్దీ, దానికి తగిన జేరాలు వస్తూంటాయి. రోజు రోజుకూ మెరుగులు దిద్దుతున్న కొద్దీ, దాని విలువ పెరుగుతూ వుంటుంది. ఎక్కువ మందిచే ఆకర్షింపబడుతుంది. కొద్దిరోజులలో, చిత్రకారుని చేతిలోనుంచి పరాధీన కాబోతుంది.

ఆ విధంగానే ఈ దంపతులు కిశోర్‌ను ఒక క్రమమైన, రమ్యమైన చిత్రంగా తయారు చేసుకుంటున్నారు. ఈతని మీద ప్రజలదృష్టి పడుతోంది. ఆ చిత్రరచనలో ప్రజలుకూడా పాలుపంచుకొని ప్రగల్భాలు చెప్పుకోవాలని అపేక్షిస్తున్నారు.

అదీకాకుండా తండ్రి కొడుకుల మధ్యవున్న వాత్సల్యభక్తులకు కూడా కొన్ని అంతరాయాలున్నాయి. కుమారుని చిన్నతనంలో ప్రేమ బంధనం బాగా పెనవేసుకొని విడదీయటానికి వీలు లేకుండా వుంటుంది. కుర్రవాడు పెద్దవాడై ప్రపంచంలో ఒక్క తండ్రేకాదు ఇంకా చాలా మంది ప్రేమింప వలసిన వారున్నారని గ్రహిస్తాడు. దానితో పూర్వం తండ్రితో పెనవేసుకొని వున్న బంధం క్రమేపీ ఒదులవుతూ వస్తుంది. దానిలో పూర్వం వున్న బిగువు పోతుంది. ఒకనాటికి ఎవరు ఏమాత్రం విదలించుకున్నా ఆ బంధం తెగిపోతుంది. ఇంకొకరితో పెనవేసుకుంటుంది.

ఆవిధంగానే తండ్రి కొడుకులమధ్య వున్న అనుబంధం, కిశోర్ స్కూలుఫైనలు ప్యాసు అవడంతో కొంచెం సడలింది. అంతవరకూ తండ్రి శాసించిన కఠిన శిక్షణలోనూ, ఆయన నిర్మించిన గడులలోనూ నడిచాడు కిశోర్. నియత పరిమితులలో తిరగడంవలన వారిరువురి మధ్యా అనంతమైన ప్రేమవాత్సల్యాలు తొణికిసలాడాయి. కాని కిశోర్ స్కూలు ఫైనలు ప్యాసయి, కాలేజీలో చేరినతరువాత కొద్దిగా కొద్దిగా ప్రపంచం చూడడం మొదలుపెట్టాడు. కొంచెం కొంచెం తల్లిదండ్రులకు దూరం అవడం, వారి మాటలను పాటించక పోవడం అవసరమయింది.

పోను పోను, నిత్యజీవనంలో కిశోర్ తండ్రి అభీష్టాలను నెరవేర్చలేక పోతున్నాడు. అయినప్పటికీ, చిన్ననాటినుంచీ ఉగ్గుపాలతో రంగరించి నేర్పిన కళాసేవ అతనిలో అంతరించలేదు. కనీసం కొద్దిగానన్నా తరుగలేదు. పైగా పెచ్చుపెరిగి పోయింది. ఈ ఆశయం అతన్ని ఆవేశంలోకి దింపింది. నూతనంగా స్వతంత్ర భావాలు మొలకెత్తడం ప్రారంభించడం వలన ఆ ఆవేశం ఒకవిధమైన పిచ్చిగా మారింది. ఇపుడు కిశోర్ దృక్కులు ఏకముఖంగా పరుగిడుతున్నాయి. అతని చరమాశయం కళాసేవ.

ఈ దృష్టి ననుసరించి భావాలూ, ప్రవర్తనా పరుగులెత్తుతున్నాయి. నానాటికి తల్లి దండ్రులకు దూరం కావలసివస్తోంది. ఇది తల్లిదండ్రులకు తీరని బాధను కలిగించింది. వాళ్లు తమ సంతానంనుంచి ఆశయసిద్ధినే కాంక్షించారుగాని, అతడు తమనుంచి దూరం కావడం ఏనాడూ అపేక్షించలేదు. ఊహించలేదు కూడాను.

ఆ ప్రేమ దెబ్బతినడంతో వారికి ఆ ఆశయాలు తృణప్రాయంగా కనపడ్డాయి. ఇప్పుడు వారికి కావలసింది తమ కుమారుడు ఆశయాలు సిద్ధించేందుకు కృషి చేయడం కాదు, పూర్వం మాదిరి తమ బాహువల్లరిలో ప్రేమకలాపాలు సాగిస్తూ ఆడుకోవడం.

*　　*　　*

వీరిరువురి విభిన్న కాంక్షలకూ ఘర్షణ ఏర్పడింది. ఆ ఘర్షణ అంతకంతకి తీవ్రస్వరూపాన్ని తాల్చసాగింది. యుద్ధాదిని ప్రథమంలో సంధిని ఇరుపక్షాలవారూ కోరవచ్చునుగానీ, యుద్ధం తీవ్రతరమై ఇరుపక్షాలవారికీ నష్టం కలిగిన తరువాత ఎవరికీ సంధి చేసుకోవాలని ఉండదు. అవి మంచిదైనప్పటికీ లోపల చెలరేగుతున్న పగ ఒప్పుకోనీయదు. ఆ విధంగానే తండ్రి కొడుకులమధ్యనూ మొదట్లో అయితే రాజీ పొసగేదేమో. కాని రోజులు దాటినకొద్దీ అది అలభ్యం కాసాగింది. ఒకరిపట్ల ఒకరికి బిగింపు తీవ్రమైంది.

ఈ బిగింపు ఎవరికి వారు రెండవ వారివల్ల వచ్చిందనుకుంటున్నారు. దానితో ఒకరిపై ఒకరికి ఏహ్యాభావం ప్రబలమవటం ప్రారంభించింది. పగ సాధించాలనే అభిలాష తీవ్రమైంది. కిశోర్ గబగబా తన ఆశయసిద్ధికై తన తండ్రికి దూరం అయిపోతున్నాడు- ప్రసాదరావు కూడా కుమారునకు దూరం అయిపోయేవాడే కాని, పితృప్రేమ అందుకు కొంత అడ్డపడింది.

కిశోర్ దూరం అవుతున్నకొద్దీ ఈ పితృప్రేమ ప్రసాదరావుకు తెలియకుండా అధికం కాసాగింది. కుమారుని ఎడబాటు సహించలేని పరిస్థితి వచ్చింది. కాని కిశోర్ వెనుక చూపు లేకుండా తన ఆశయసిద్ధికై అహోరాత్రాలు కృషి చెయ్యసాగాడు.

తానింత అమితంగా కుమారుని ప్రేమిస్తున్నప్పటికీ కుమారుని నుంచి ప్రేమ కొంత అయినా ప్రత్యుత్తరంగా రాకపోయేటప్పటికి, ప్రసాదరావు పుత్రవాత్సల్యం దెబ్బతింది. హృదయం గాయపడింది. దానికి కొంత ఉపశాంతి కావాలి. దానికల్లా పెద్దమందు తన కుమారుడు తనకు దూరంకాకుండా వుండటమే.

ఆలోచించాడు! సమాధానం లభించింది. ఇంతకాలం కుమారుడు దూరం అవటానికి తానే తెలియకుండా దోహదం యిస్తున్నానని తెలుసుకున్నాడు. ఆ స్తోమతు తానియ్యకపోతే తన కుమారుడు ముందుకు ఎల్లా అడుగు వేయగలుగుతాడు ?—ఏకైక పుత్రుడనే గారాబంతో కిశోర్ అడిగినప్పుడల్లా అన్ని సదుపాయాలూ చేస్తూ కిశోరుకు సంఘంలో ఒక స్థానాన్ని యిప్పించాడు ప్రసాదరావు. ఇప్పుడు తానా సహకారం ఆపివేస్తే కుమారుని పురోగమనం ఆగిపోతుంది. నిస్సహాయుడై తన దగ్గరకు తిరిగి వస్తాడు.

బాగుం దనుకున్నాడు! ఇంతకు పూర్వం లాగ కొడుకడిగినప్పుడల్లా డబ్బు యివ్వడం మానివేశాడు. ఇంకా ఏమైనా అవగలనా అని తీవ్రంగా ఆలోచించాడు. తన కింక ఏమీ గోచరించలేదు. ఈ రోజుల్లో తండ్రి కొడుకుల మధ్య ప్రేమ బంధం కన్నా ధన బంధం ఎక్కువ. బలవంతాన ఆ బంధాన్ని తెంపివేశాడు ప్రసాదరావు.

సంఘంలో ఒక స్థానాన్ని పొందిన కిశోరుకు తండ్రి దగ్గరనుంచి ఆర్థిక సహాయం రాకపోయేటప్పటికి చాలా యిబ్బంది కలిగింది. ధన లోపం వలన, పూర్వం తాను సంఘంలో పొందిన విశిష్ట స్థానం యిప్పుడు శత్రువై కూర్చుంది. పోనుపోను తన స్థానానికే ముప్పు తీసుకురాబోయింది ఈ ఆర్థిక మాంద్యం.

ముందు గ్రహించుకో లేకపోయాడు కిశోర్. తన స్థాన భ్రష్టత్వానికి కారణం యిప్పుడు తెలియవచ్చింది. తన తండ్రి చేస్తున్న అవినీతి అర్థమైంది. వస్తుతః తొందర స్వభావం కానివాడు అవటంవలన కిశోర్ నెమ్మదిగా ఆలోచించి చూశాడు, తండ్రిలోని ఈ స్వార్థానికి కారణం ఏమిటా అని? తనకు దగ్గర చేసుకునేందుకు తన తండ్రి ఈ ఉపాయాలన్నీ పన్నుతున్నాడని సమాధానం వచ్చింది.

అమితంగా తన పురోగమనానికి పాటుపడే తండ్రి ఈ విధంగా చేస్తూంటే కిశోరుకు అమితమైన ఆశ్చర్యం కలిగింది. ప్రపంచంపంక చూచాడు. ఎక్కడ చూచినా తండ్రి కొడుకుల మధ్య ఈ విధమైన ఘర్షణలే కనపడుతున్నాయి.

అదేమిటి! ఒక అందమైన చిలుకను రెక్కలు వచ్చేదాకా ప్రేమతో పెంచి, వినీల విశాల ఆకాశంలో ఎగురనీయకుండా పంజరంలో బంధిస్తానంటా రేమిటి? ఏం? రెక్కలు పెంచుకున్నది, తంత్రులు నిర్మించిన బంగారు పంజరాలలో గిలగిల తన్నుకునేందుకా? చివరికి వారి ప్రేమ, మూర్ఖత క్రింద మారి, స్వార్థాన్ని ప్రేరేపింప చేస్తోంది-అనుకున్నాడు కిశోర్.

వినీలాకాశంలో వినూత్న విషయాలను చూచి ఆనందించకుండా, ఈ బంగారు పంజరంలో రెక్కలుముడుచుకు, గర్వపడడం కేవలం భ్రమ అనుకున్నాడు కిశోర్. పంజర ద్వారం పూర్తిగా మూయకముందే తప్పించుకొని పారిపోవడం చాలా మంచి దనుకున్నాడు. గట్టిగా ప్రయత్నించాడు. తండ్రివైపు నుంచి కూడా కొడుకు తప్పించుకు పోకుండా ఆపాలని ప్రయత్నాలు తీవ్రంగా సాగాయి. కాని యువకుడు కిశోర్ గెలిచాడు. పంజరంలోంచి తప్పించుకొని విశాలప్రపంచంలో అడుగుపెట్టాడు.

*　　*　　*

కిశోర్ యింట్లోనుంచి వెళ్లిపోయాడు. గృహంలో అంతర్యుద్ధంచేస్తూ, బయట అసీమ ప్రపంచంలో ఆశయసిద్ధికై కృషిచేయలేనసే అభిప్రాయంతో, ప్రేమపాశాల నన్నిటినీ త్రెంచుకొని బయటకు వెళ్ళిపోయాడు.

ఈ ప్రేమబంధనాలు బలవంతాన, అందులో కిశోర్ చేత, తెంపబడేటప్పటికి తీరని బాధ కలిగింది ప్రసాదరావుకు. ఆ బాధ సహింపరానిదయింది. దానిని ప్రసాదరావు ఒక అవమానంగా పరిగ్రహించాడు. తన కుమారుడు తనను ఎదిరించి వెళ్లిపోతాడా? ఇది తాను సహించలేని విషయం. ఆ ప్రేమఅంతా ద్వేషం, విరోధం క్రింద మారిపోయింది.

ఈ ద్వేషంతోనూ, విరోధంతోనూ ప్రసాదరావు పూర్వంకన్న తీవ్రంగా కుమారునిపై కత్తి దూశాడు. ఊరిలోని వారందరితో అతనిపై నేరారోపణ చేస్తూ దుష్ప్రచారం చేశాడు. తండ్రియై తనకుమారునిమీద చెపుతున్న అపవాదులను ఎవరూ కాదన లేకపోయారు. పూర్తిగా విశ్వసించారు, ముక్కుమీద వేలు వేసుకున్నారు. పరిహాసించారు. కిశోర్‌ను పితృద్రోహిక్రింద జమకట్టారు.

అందరూ వచ్చి, తన్ను పుత్రవియోగానికి ఓదారుస్తూ, అదే నోటితో తన కుమారుని తన ఎదుటే దూషిస్తూంటే ప్రసాదరావుకు అమితమైన ఆనందం కలిగింది. వారితోపాటు తాను కూడా ఏదోముక్క అంటే అతని దెబ్బతిన్న హృదయానికి కొంత ఉపశమనం కలిగేది. అంతే- ఈ రోజుల్లో తండ్రి కొడుకులం నామమాత్రానికే తండ్రి కొడుకులు!

కాని తీరిక సమయాలలో భార్య, దగ్గరకు జేరి, కిశోర్ ఎడబాటును జ్ఞప్తికి తెస్తూండేది. దంపతు లిద్దరూ రహస్యంగా, తీరికగా దుఃఖించేవారు. మరి పైకి ప్రసాదరావు అందరితోనూ ఆవిధంగా మాట్లాడుతాడేం? అది కేవలం ఆత్మతృప్తికోసం. సంఘంలోని తమ స్థానాన్ని బలపరుచుకునేందుకు. లేకపోతే తామే తమ కుమారుడు యింట్లోనుంచి బయటకు వెళ్లిపోడానికి కారణభూతుల మంటే, ఎవరు హర్షిస్తారు? పూర్వం యితరులనుంచి లభించిన ఊరడింపు పూర్తిగా పోయి బహిష్కరణ ఎదురై కూర్చుంటుంది.

కాని కిశోర్, పిచ్చితల్లి కి రాజకీయాలు ఎదురువచ్చేవి కావు.అస లవి చాతకావు కూడా. ఆమెకల్లా ప్రధానం కుమారుడు తనదగ్గర వుండటమే. ఒకరు దూషించినా, పరిహాసించినా ఆ మాతృప్రేమప్రవాహానికి ఎవరూ అంతరాయం కలిగించలేరు. కుమారుని పలాయనానికి తనభర్త కారణం అని ఆమె గ్రహించుకున్నది. దాంతో దానికి కారణ భూతుడైన తనభర్తమీద కత్తి దూసింది. అసలు కిశోర్ పారిపోవడానికి కారణం బయటపెట్టింది. దాంతో పూర్వం ప్రసాదరావుకు దొరుకుతున్న ఓదార్పు ఇప్పుడు అలభ్యమవుతూ వచ్చింది.

*　　*　　*

అలా రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతున్నాయి. ఆసరాలేక తిరిగివస్తా డనుకున్న ఆశ ప్రసాదరావుకు పూర్తిగా నశించింది. ఎప్పటికైనా అనివార్యమైన క్షుద్బాధను సహించలేక పుత్రుడు తిరిగిరాడా అనేధీమాతో కాలం

గడిపాడు ప్రసాదరావు. ఇప్పుడు అది పూర్తిగా నశించింది.

దానితో పూర్వం తన కుమారునిపైన వున్న ద్వేషం మంచులా క్రమక్రమంగా కరిగి,అప్రేమ వాహినిలో కలుస్తోంది. నానాటికి ఆ ప్రేమ ప్రవాహం అమితంగా పెరిగిపోతోంది. దాంతో ప్రవాహపు వేగంకూడా అధికం కాసాగింది. ఒరవడితో ప్రవహించడం ప్రారంభించింది. దానిని ఆపడానికి శక్యం కాకపోయింది ప్రసాదరావుకు. ఈ వాహినిలో తనభార్య మాతృప్రేమ యింకొక అంతర్వాహినిగా మిళితమయింది. దాని వేగానికి దోహద మిచ్చింది. ఆ ప్రవాహం చిన్న చిన్న అవాంతరాలను లెక్కచేయని పరిస్థితికి వచ్చింది. ఇప్పుడు తమ కుమారుని చూడందే ఆ దంపతులు ఒక్క క్షణం వుండలేరు.

*　　*　　*

కిశోర్ తల్లిదండ్రులను వదలి వెళ్లిపోయిన తరువాత చాలా యిబ్బందులు పడ్డాడు. ఒక్కసారిగా వెలుతురులోనుంచి కటిక చీకటిలోకి అడుగు పెట్టినట్లయింది. ముందుకు దారి కనిపించడం కష్టమైంది. దానితో పాటు ప్రపంచంలో ప్రళయ తాండవం చేస్తున్న ధనం తనను త్రొక్కివేయ ప్రయత్నించింది. తాను దాని తాండవానికి అనుగుణంగా అడుగులు వేయవలసి వచ్చింది. ఆ ధనపిశాచి చేతిలోంచి తప్పించుకొన గలిగాడు.

ఇంతకు పూర్వం తండ్రి సహాయం వలన తనకు లభించిన స్థానం కొంతవరకు సహాయం చేసింది. అహోరాత్రాలు ఆశయసిద్ధికై పని చేశాడు. తన తీవ్రమైన కృషితోనూ, ఆప్తుల సహాయంతోనూ తన ఆశయసిద్ధికై ముందుకు చొచ్చుకుని వెళ్ళాడు.

తన శ్రమలు ఫలించాయి. ప్రపంచంలో తన ఆశయపు వీథిలో విశిష్టమైన సౌధాన్ని నిర్మించుకున్నాడు కిశోర్. ప్రపంచం అతన్ని గుర్తించింది. అందరి దృష్టిలో అత డొక కళారాధకుడు. కళామతల్లి ప్రియపుత్రుడు.

*　　*　　*

ఒక మనిషిమీద ప్రేమగానీ, వాత్సల్యం గానీ ఆ మనిషి మనకు దూరంగా వున్నప్పుడు ఎక్కువ అవుతుంది. అప్పుడు ఆతని సాన్నిధ్యం కోరుతాము. అందులో ఆ మనిషి లభించడేమో నన్నప్పుడు,ఆశనిరాశ క్రింద మారి, ఆగినతర్వంలో మనం అతనికి యింకా దగ్గర అవుతాము. అందుకనే మనం గతించిన మానవులను ఎక్కువగా ప్రేమిస్తుంటాం.

పుత్రవియోగంతో ప్రసాదరావు పది సంవత్సరాలు గడిపాడు. ఇంత వరకు తన కుమారుని దగ్గిరనుంచి ఉత్తరంగాని,కనీసం అతనివునికిగురించి గాని ప్రసాదరావుకు తెలియదు. పోను పోను అతనికి తన కుమారుడు అసలు తిరిగి రాడేమో, లేక లేడేమోనన్న సందేహం ప్రబల మవుతోంది.

దానితో కిశోర్ మీద వున్న ప్రేమకు పంద రెట్లు ప్రేమ తనలోనుంచి పుట్టుకురావడం ప్రారంభించింది. ఇక మాతృప్రేమను గురించి చెప్ప నవసరం లేదు. ఆ దంపతులు వృద్ధులై పోయారు. పెన్షనుగా వచ్చే డబ్బుతో తమ జీవితాన్ని, ఏనాటికైనా తమ కుమారుని చూడ గలం అనే ఆశతో, గడుపుతున్నారు.

*　　*　　*

క్రమ క్రమంగా వారిలోని ఆశ పట్టు తప్పి పోతుంది. పశ్చాత్తప్తులైన ఈ వృద్ధులు తమ కుమారుని ఒక్కసారి చూడాలని దృష్టి మందగించిన కళ్ళతో ఎదురు చూస్తున్నారు.

వెన్నెల రాత్రి. అప్పుడే ఉదయించిన చంద్రుడు తన వెన్నెల కిరణాలను యింకా విరివిగా ప్రసాదించాలని ప్రయత్నిస్తున్నాడు. సావిట్లో దీపంముందు కూర్చుని ప్రసాదరావు జడభరతోపాఖ్యానం చదువుకుంటున్నాడు. ఈ రోజుల్లో అతను ఈ చరిత్రను ఎన్నిసార్లు చదివాడో లెక్కలేదు. చివరికి ఆ భరతునిమాదిరే తన జీవితంకూడా అంతరించిపోతుందని అతని పూర్తి విశ్వాసం.

ఆ గాథ చదువుతున్న కొద్దీ అతనికి దుఃఖం వస్తోంది. పుస్తకపఠనం ఆపి, చెమ్మగిలిన కళ్ళ జోడు తుడుచుకొని మళ్ళీ చదువు ప్రారంభించాడు. కాని చదువలేక పోయాడు. తన కళ్లు నీళ్ళతో నిండిపోయాయి. పుస్తకపఠనం ముగించి శూన్యదృక్కులు చూస్తూ కూర్చున్నాడు.

పరిపరివిధాల తన మానసం పరుగులెత్తుతోంది. నిజానికి కిశోర్ తనకుచేసిన ద్రోహం ఏమిటి? ఉగ్గుపాలతో తాను తన ఆశయాలను రంగరించి నేర్పాడు. నవనాడులలో ప్రవహించిన ఆ సంస్కరణ కిశోర్‌లో తీవ్రస్వరూపాన్ని దాల్చింది. కిశోర్‌లో ఆ ఆశయపుజ్వాలలు వెలుగొందాయి. దానికోసం ఏకముఖంగా కృషిచేయడం ప్రారంభించాడు. దాంతో తనకు దూరంకాసాగాడు. నిజానికి ఆ ఆశయసిద్ధి తాను కోరినదేగా—? అవును మరి, ఎగుర నేర్పిన పక్షి ఎగురకుండా ఎలా వుండగలదు? దాంట్లో కిశోర్ తనకు చేసిన ద్రోహం ఏమిటి?

వీథి గుమ్మంలో ఎవరో నిలబడివున్నారు. బలిష్ఠమైన దేహం, ఒడ్డుపొడుగు కలిగిన ఆకారం...అరె కిశోర్! కళ్లు తుడుచుకొని మళ్ళీ చూచాడు. తనకళ్లు తన్ను మోసం చేయలేదు. ఎన్నాళ్ళకు తన కుమారుడు తిరిగి వచ్చాడు! ఎంతో ఆనందంతో గబగబా వెళ్ళి కుమారుణ్ణి కౌగిలించుకొని, బావురుమన్నాడు ప్రసాదరావు.

కిశోర్ ఏడుస్తూ "నాన్నా! నువ్వు కోరిన ఆశయాలు సాధించడానికే ప్రయత్నించాను. జయించాను, నాన్నా" అన్నాడు.

ఈ కేక విని తల్లి పరిగెత్తుకొచ్చింది. బిగి కౌగిలిలోవున్న తండ్రికొడుకులను చూచింది. అక్కడే కూలబడిపోయింది...

"అవును నాయనా! నేను అర్థం చేసుకోలేకపోయాను. నువ్వు నా కోరికలకోసమే కృషి చేశావు" అన్నాడు ప్రసాదరావు వెక్కి వెక్కి ఏడుస్తూ.

* * *

చాలా కాలం తరువాత ప్రసాదరావు ఊళ్ళోకి, లాంగు కోటు వేసుకొని వచ్చాడు. కనపడ్డవాళ్ళందరికీ తన కిశోర్ తిరిగి వచ్చాడని చెప్తున్నాడు...తానా విధంగా కిశోర్ జీవితాన్ని కష్టానికి గురిచేయడం వలననే, తన కుమారుడు అంతటివాడయ్యాడని గర్వంగా చెప్తుకుంటున్నాడు ప్రసాదరావు ... పూర్వం ప్రసాదరావు కుమారుని గురించి చెప్పిన చెడు మాటలను నమ్మింది ప్రపంచం. ఇప్పుడు మళ్ళీ కుమారుని గురించి గర్వంగా చెప్పుకుంటున్న మాటలనూ నమ్ముతోంది ప్రపంచం ... ఇది కేవలం గుడ్డి ప్రపంచం.

# ప్రపంచరాజకీయాలు – ఆసియా ప్రాముఖ్యం

తాడిమళ్ల జగన్నాథరావు

పాడిపంటలతో, ప్రకృతిసంపదలతో తులతూగుతూ వచ్చిన ఆసియా దేశాలపై పాశ్చాత్యుల దృష్టి ఏనాడో పడింది. మొదట్లో వర్తకరీత్యా వారు ఆసియాలో ప్రవేశించారు. ఇచ్చటి ముడిపదార్థాలను చవుకగా కొని తయారీ వస్తువులను తిరిగి ఈ దేశాలలోనే ప్రియంగా అమ్మి పాశ్చాత్యులు అధిక లాభాలను సంపాదించారు. వర్తక సంబంధాలు క్రమేపీ రాజకీయ సంబంధాలుగా మారాయి. విదేశీయులు ఆసియా, తదితర దూరప్రాచ్యదేశాలలో రాజకీయాధిపత్యం సంపాదించ గలిగారు. విదేశీయ పాలనలో ఆసియా పీల్చి పిప్పి చేయబడింది. దానితో ఆసియా వాసులలో స్వాతంత్ర్య సంపాదనోద్యమాలు పెరిగాయి. కాలానుగుణంగా వర్తించే బ్రిటన్ ఆసియాలో తన సామ్రాజ్యాన్ని ఇరవయ్యో శతాబ్దంలో కూడా నిలుపుకో చూడడం అసాధ్యం అనుకుంది. ఇండియా, పాకిస్తాన్, బర్మా, సింహళాలకు సంపూర్ణ స్వరాజ్యం ఇచ్చివేసి వైదొలగింది. ఫ్రెంచివారూ, పోర్చుగీసువారూ మాత్రం బ్రిటన్ నుంచి గుణపాఠం పూర్తిగా నేర్చుకోలేకపోతున్నారు. ఇంకా వారు తమ పాత సామ్రాజ్యవాద ధోరణిలోనే ఉన్నారు. ఇండియా అంతనూ బ్రిటన్ వదలుకొని పోగలి